క్లుప్తంగా

సేవలకు సన్మానం



వెంకటేశ్వర్లు దంపతులను సన్మానిస్తున్న పంచాయతీరాజ్ ఉద్యోగులు

ఆదోని టౌన్: పంచాయతీరాజ్, రూరల్ వాటర్ సప్లై శాఖల్లో దాదాపు 38 యేళ్లకు పైగా ప్రజలకు సేవలందించి పదవీవరమణ పొందిన పీఆర్ ఏఈ వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ జీపు డ్రైవర్ రాజును శుక్రవారం ఘనంగా సన్మానించారు. వారి సేవలను పీఆర్ ఏఈ పద్మజ కొనియాడారు.

డీఎస్పీని కలిసిన బీజేపీ నాయకులు



డీఎస్పీ హేమలతకు ఛత్రపతి శివాజీ ప్రతిమను అందజేస్తున్న బీజేపీ నాయకులు

ఆదోని అర్బన్: నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీఎస్పీ హేమలతను బీజేపీ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని అందించి అభినందనలు తెలిపారు. డీఎస్పీనికలిసిన వారిలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఆదూరి విజయ్‌కృష్ణ, కార్యదర్శి రమాకాంత్, బీజేవైఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి శ్రీనివాస ఆచారి తదితరులు ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఆదోని టౌన్: ఆర్టీసీ ఆదోని డిపోలో శుక్రవారం జై భీమ్ అసోసియేషన్ క్యాలెండర్, డైరీని డిపో మేనేజర్ రఫీక్‌అహ్మద్, ట్రాఫిక్ సిబ్బంది మల్లికార్జున ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయూ డిపో కార్యదర్శి హరిబాబు, నాయకులు ఆరోగ్యప్ప, సక్రప్ప, గోవిందు, ఆంజనేయులు, ఉలిగప్ప, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలకే గుర్తింపు

ఎమ్మిగనూరుటౌన్: విధి నిర్వహణలో మెరుగైన సేవలందిస్తే మంచి గుర్తింపు లభిస్తుందని స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ మద్దిలేటి నాయుడు పేర్కొన్నారు. ఆర్టీసీ డ్రైవర్లుగా పని చేసి పదవీ విరమణ పొందిన వీపీసీ రెడ్డి, వైఎస్ ఆజాంలను శుక్రవారం డిపో ఆవరణలో సిబ్బంది, యూనియన్ నాయకులతో కలిసి ఆయన ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప, యూనియన్ల నాయకులు ముస్తక్ అహమ్మద్, రఫీక్, ఎంఎస్ వాసు పాల్గొన్నారు.

వైభవంగా కలశ పూజలు



ఆలయంలో హమాలు నిర్వహిస్తున్న భక్తులు

కోసిగి: మండల కేంద్రంలోని పద్మశాలి కుల బాంధవుల ఆరాధ్య దైవం భక్త మార్కండేయ స్వామి గోపుర శిఖర, ముఖ ద్వార శిఖర కలశ స్థాపన పూజలు రెండో రోజున వైభవంగా జరిగాయి. శుక్రవారం ఆలయంలో ఆదోనికి చెందిన వేదపండితులు గరుడాద్రి వెంకటసుబ్బయ్య శాస్త్రీ ఆధ్వర్యంలో గోపుర కలశాలను వేదమంత్రోచ్ఛరణాల మధ్య జలాదివాస పూజలు చేపట్టారు. ప్రధాన దేవత సహిత శిఖర దేవతలకు రుద్రాభిషేకం, మహాస్తపనం, మహా సుదర్శన హోమం, లక్ష్మీ హోమాలు నిర్వహించారు. భక్తులు నిష్టతో గోపుర కలశ పూజల్లో పాల్గొన్నారు.

పత్తి మిల్లులో అగ్ని ప్రమాదం

- 4,800 క్వింటాల పత్తి దగ్ధం



అగ్ని ప్రమాదం సంభవించిన పత్తి మిల్లు

నందవరం: మండల పరిధిలోని ముగతి గ్రామ సమీపంలో 167వ జాతీయ రహదారి పక్కన ఉన్న మురహరి పత్తి జిన్నింగ్ మిల్లులో శుక్రవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. మిల్లులో హర్ట్ బాక్స్ మోటర్ హిట్‌తో షార్ట్ సర్క్యూట్ కావడంతో నిప్పు రవ్వలు ఎగసి పక్కనే ఉన్న పత్తిపై పడటంతో మంటలు వ్యాపించాయి. వెంటనే స్థానికులు గమనించి మంటలు ఆర్పేందుకు యత్నించినా వీలు లేక పోవడంతో ఫైర్ స్టేషన్‌కు ఫోన్ చేశారు. భారీగా పొగలు అలుముకోవడంతో ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. మిల్లు ఓనర్, బాధితుడు మురహరి రెడ్డి వివరాల మేరకు దాదాపు రూ.3 కోట్ల విలువ చేసే 4,800 క్వింటాళ్ల పత్తి దగ్ధమైందని తెలిపారు. ఫైర్ అధికారులు డీఈఆర్, ఎఫ్ఓ కర్నూలు అధికారి అవినాష్ జయసింహా, డీఎఫ్ఓ రామాంజనేయులు, ఫైర్ సిబ్బంది నాగరాజు, గోపాల్, మహబూబ్‌బాషా, చిన్న రాముడు, విశ్వనాథ్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

పట్టుబడిన మద్యం ధ్వంసం

ఆదోని రూరల్: వివిధ కేసుల్లో పట్టుబడిన కర్ణాటక మద్యాన్ని శుక్రవారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఏఈఎస్ డి.రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సీఐ ఎస్.కె.జె.సైదుల్ సమక్షంలో ధ్వంసం చేశారు. ధ్వంసం చేసిన మద్యం విలువ సుమారు రూ.9,79,200 ఉంటుంది.

దాతృత్వ పరిమళాలు

- ఉరుకుంద ఈరన్న క్షేత్రంలో వెల్లివిరిసిన దాతల సహకారం
- రాజగోపురాలు, కలశాలు, భక్తుల విడిది షెడ్ల ఏర్పాటు

మంత్రాలయం/కౌతాళం: ప్రముఖ ఉరుకుంద ఈరన్న క్షేత్రం కుంభాభిషేక వేళ భక్తుల దాతృత్వం పరిమళాలు వెదజల్లుతోంది. ప్రగతి శిఖరమై పరిఢవిల్లుతోంది. ఆధ్యాత్మిక సేవా మంత్రమై శోభిల్లుతోంది. క్షేత్రం రూపురేఖలు మహర్దశకు మూలమై నిలిచింది. గతమెన్నడూ లేనంతగా భక్తులు విరాళాలు ఇవ్వడంతో క్షేత్రం దశ మారిపోయింది. సుందరాన్ని సంతరించుకుని నవ మనోహర వైభవాన్ని చాటుతోంది. జిల్లాలోనే దేవదాయ శాఖ ప్రధాన క్షేత్రం ఉరుకుందలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతుండటం సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

భక్తుల విరాళాలపై సర్వత్రా హర్షం

దేవదాయ శాఖ పరిధిలోని ఏకైక డీసీ ఆలయం ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయం. ఇక్కడకు ఎక్కువగా సాధారణ భక్తులు వస్తుంటారు. వెనకబడిన ప్రాంతం కావడంతో దాతల సంఖ్య అంతంతమాత్రమే. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన కొందరు భక్తులు ఆలయానికి అంతరంగిక భక్తులుగా ఉంటూ విరాళాలు ఇవ్వడం విశేషం. ప్రాంతాలకు అతీతంగా భక్తులు ఉరుకుంద క్షేత్రానికి విరాళాలు ఇచ్చారు. భక్తుల విరాళాలతో అటు ఆలయ రూపురేఖలు మారడం, ఇటు సామాన్య భక్తులకు వసతులు సమకూరడంతో స్వామి భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ ప్రగతిలో చేతులు కలిపిన భక్తులకు ఆలయ డిప్యూటీ కమిషనర్ మేడేపల్లి విజయరాజు ప్రత్యేకంగా కుంభాభిషేకానికి ఆహ్వానం సైతం పలికారు.



విద్యుద్దీప కాంతుల్లో రూపుదిద్దుకున్న రాజగోపురాలు

దాతృత్వానికి నిదర్శనాలు..

➤4 రాజగోపురాల నిర్మాణానికి రూ.లక్షకు పైగా దాదాపు 250 మంది భక్తులు విరాళంగా ఇచ్చారు. రాజగోపురాల నిర్మాణంలో భాగస్వాములై ఆలయానికే వన్నె తెచ్చారు.

➤రూ.84 లక్షల వ్యయంతో బంగారుపూతతో గోపుర కలశాలు పూర్తి చేశారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కుటుంబ సభ్యులు రూ.13 లక్షల టేకు తలుపుతోపాటు 7 కలశాలు తయారు చేయించారు. నిడ్జూరుకు చెందిన మురహరి వెంకటరమణమ్మ టేకు డోరుతోపాటు మరో 5 కలశాలు, కేజీ వెండితో కూడిన యంత్రాలు చేయించారు. రాయచూరుకు చెందిన రమేష్‌శెట్టి టేకు తలపుతోపాటు లక్ష్మి విగ్రహ మంటపం నిర్మించారు. కర్నూలుకు చెందిన మార్వెళ్ల వాస్తువ్యులు వీర ప్రమోద్ టేకు తలుపు చేయించారు.

➤రాజగోపురాలపై సీసీ విగ్రహాల ఏర్పాటుకు గద్వాల జిల్లా మాన్‌దొడ్డికి చెందిన లక్ష్మణ్‌స్వామి, బళ్లారికి చెందిన కిరణ్‌కుమార్, బళ్లారికి చెందిన లక్ష్మీనారాయణ సహకారం అందించారు.

➤లక్షలాది రూపాయల వ్యయంతో 5 రాజగోపురాలకు భక్తులు సొంతంగా రంగులు వేయించారు. మాన్వికి చెందిన శకుంతల నాయక్, రాయచూరు వాసి వాసుదేవ, హైదరాబాద్ వాసి జవహర్, రాయచూరు లక్ష్మి, జాలవాడి వాసులు చంద్రశేఖర్ గుప్తా, ధనుంజయ గుప్తా, ఆనంద్‌గుప్తా రంగులు వేయించారు.

➤క్షేత్రం పరిధిలోని ఐదు ప్రధాన క్షేత్ర రహదారుల్లో ఆలయ ముఖద్వారాలున్నాయి. ఉరకుంద వాసులు కే.శే. రుద్రముని కుటుంబ సభ్యులు (హాల్వి ముఖద్వారం), ఉరుకుంద వాస్తువ్యులు మమతారెడ్డి, రామన్‌గౌడ్ (కుప్పగల్లు ముఖద్వారం), నాగర్ కర్నూలుకు చెందిన చీదిరి విజయలక్ష్మి కుటుంబ సభ్యులు (ఉరకుంద ముఖద్వారం), బసాపురం గ్రామానికి చెందిన శాంతాబాయి దంపతులు (ఎరిగేరి ముఖద్వారం), మాన్వికి చెందిన లలిత దంపుతులు (కోసిగి ముఖద్వారం) రంగులు వేయించారు.

➤సామాన్య భక్తులు విడిది చేసేందుకు గానూ ఓ భక్తుడు రూ.50 లక్షలు వెచ్చించి ప్రత్యేక షెడ్లు వేయించారు. బళ్లారికి చెందిన మిరియాల నాగరాజు అనే భక్తుడు ఇంటిని విక్రయించగా వచ్చిన డబ్బుతో షెడ్ల నిర్మాణం చేపట్టారు. సదరు షెడ్ల కింద వెయ్యిమందికి పైగా బస చేసేందుకు వీలుంటుంది.

➤రాయచూరుకు చెందిన ఓ అజ్ఞాత భక్తుడు రూ.8 లక్షలు విలువజేసే టికెట్ల కౌంటర్ల కంటైనర్‌ను విరాళం ఇచ్చారు.

➤రాజగోపుర కలశాలకు మరో 15 మందికి పైగా భక్తులు విరాళం ఇచ్చారు.

➤దాతల సహకారంతో నతన లక్ష్మి, వినాయక, నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠకు సాయం చేయడం జరిగింది.

➤ఆలయ ఉద్యోగులంతా చెరో ఇంత విరాళంగా ఇచ్చుకుని స్వామికి గరుడు, శేష, గజ వాహనాలు చేయించారు.

➤దేవస్థానం అర్చకుల బృందం రూ.20 లక్షలతో యాగశాల ఏర్పాటుకు ముందుకు వచ్చారు.

➤విజయవాడకు చెందిన పాండురంగ గణేష్ అనే భక్తుడు 40 అడుగుల టేకు ధ్వజస్తంభం చేయించారు.

➤ఆదోని శైలజ, ఉమాశంకర్ దంపతులు ధ్వజస్తంభ ఇత్తడి కవచం తయారీకి సహకారం అందించారు.



భక్తుడు మిరియాల నాగరాజు ఏర్పాటు చేసిన విడిది షెడ్



రాయచూరు అజ్ఞాత భక్తుడు విరాళంగా ఇచ్చిన కంటైనర్



విజయవాడ భక్తుడు తయారు చేయించిన టేకు ధ్వజస్తంభం

భక్తిశ్రద్ధలతో అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ట

కోసిగి: మండల పరిధిలోని జంపాపురం గ్రామంలో గ్రామస్తుల సహకారంతో నూతనంగా సుంకులమ్మ, రామక్కమ్మ దేవిల ఆలయాల ప్రారంభోత్సవం ఘనంగా చేపట్టారు. శుక్రవారం ఆలయ ధర్మకర్త సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు పద్మనాభ స్వామి నేతృత్వంలో సుంకులమ్మ దేవి, రామక్కమ్మ దేవి విగ్రహాల ప్రతిష్టాపన ఘనంగా నిర్వహించారు. గణపతిపూజ, గాయత్రి పూజ, రుద్ర పూజ, లక్ష్మీ పూజ, సకల దేవతల ఆరాధన పూజలు చేపట్టి, హోమాలు నిర్వహించారు. అనంతరం గ్రామ ప్రజలు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.

రహదారి నిబంధనలు పాటించాలి

- డీఎస్పీ హేమలత



యమధర్మరాజు, చిత్రగుప్తుడు వేషధారణలో వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ

ఆదోని అర్బన్: రహదారి నిబంధనలు పాటించాలని డీఎస్పీ హేమలత వాహనదారులకు సూచించారు. శుక్రవారం భీమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కాలేజీ విద్యార్థులతో యమధర్మరాజు, చిత్రగుప్తుడు వేషాలు వేయించి వారి ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. టూటౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి భీమాస్ సర్కిల్, శ్రీనివాసభవన్ మీదుగా, అక్కడి నుంచి ప్లకార్డుల ద్వారా ట్రాఫిక్ రూల్స్‌ని చూపుతూ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు, టూటౌన్ సీఐ సూర్యమోహన్‌రావు పాల్గొన్నారు.

➤మైనర్లు వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడొద్దని ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు సూచించారు. అక్షరశ్రీ జూనియర్ కళాశాలలో ఆయన విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు.

➤**పెద్దకడబూరు:** ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని ఎస్ఐ నిరంజన్‌రెడ్డి సూచించారు. జాలవాడి – కంబలదిన్నె గ్రామాల మధ్య సిబ్బందితో కలసి శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టాడు.

కౌన్సిల్ సమావేశం రసాభాస

- సమస్యలు సభ దృష్టికి తెస్తుండగా 'సోది' అంటూ టీడీపీ సభ్యుల రన్నింగ్ కామెంట్
- క్షమాపణ చెప్పాలని వైఎస్సార్‌సీపీ సభ్యుల డిమాండ్



రసాభాసగా మారిన సమావేశం

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపల్ సమావేశ భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కౌన్సిల్ సమావేశం రసాభాసాగా మారింది. వైఎస్సార్‌సీపీ సభ్యుడు సమస్యలను సభ దృష్టికి తెస్తుండగా టీడీపీ సభ్యుడు రన్నింగ్ కామెంట్ చేయడంతో సభ గందరగోళంగా మారింది. వెంటనే క్షమాపణ చెప్పాలని వైస్సార్‌సీపీ సభ్యులు పట్టుబట్టారు. సదురు టీడీపీ కౌన్సిలర్‌పై చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతకుముందు అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. అనంతరం తన వార్డు సమస్యలు పరిష్కరించాలని 6వ వార్డు కౌన్సిలర్ ఎంకే శివప్రసాద్ సభ దృష్టికి తెచ్చే ప్రయత్నం చేస్తుండగా సోది చెబుతున్నారంటూ టీడీపీ కౌన్సిలర్ రామ్‌దాస్‌గౌడ్ రన్నింగ్ కామెంట్ చేశారు. దీంతో వైఎస్సార్‌సీపీ, టీడీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం నెలకొంది. ప్రజా సమస్యలను చెబితే సోది ఎలా అవుతుందని, ఇది పద్ధతి కాదని చైర్మన్ డాక్టర్ కెఎస్ రఘు సైతం తప్పుబట్టారు. సభ గందరగోళంగా మారడంతో చైర్మన్ సభను ముగించారు. అంతకు ముందు 42 అంశాలతో పాటు టేబుల్ అజెండాలోని అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో కమిషనర్ గంగిరెడ్డి, ఆర్ఓ అస్లాంబాషా, డీఈలు నీరజ, రాజునాయక్, ఏఈలు శరత్‌చంద్ర, మదన్‌కుమార్, మేనేజర్ వరప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

సమస్యలపై గళమెత్తిన కౌన్సిలర్లు

➤పెద్ద పార్కులో వ్యాయామ పరికరాలు మరమ్మతు చేయించాలని, కోవిడ్‌తోపాటు అనారోగ్య సమస్యలతో మృతి చెందిన మున్సిపల్ కార్మికుల కుటుంబాల్లో కారుణ్యనియామకాలు చేపట్టి వారికి న్యాయం చేయాలని వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ చైర్మన్ దృష్టికి తెచ్చారు.

➤6వ వార్డులో చేపట్టే రోడ్డు పనులకు టెండర్ వేసిన కాంట్రాక్టర్ సతీష్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టి రీటెండర్ పిలవాలని కౌన్సిలర్ శివప్రసాద్ కోరారు.

➤రంజాన్ పండుగ సమీపిస్తున్నందున ఈద్గాలో పనులు చేపట్టాలని, ఖబరస్తాన్‌లో విద్యుత్ దీపాలు, మార్గ మధ్యలో ఉన్న డ్రైన్‌కు పైపులు ఏర్పాటు చేయాలని 14వ వార్డు కౌన్సిలర్ ఖాశింబేగ్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.

➤22వ వార్డులో హైస్కూల్ వెనుక భాగంగా తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని వార్డు కౌన్సిలర్ కేశవరెడ్డి తెలిపారు.

➤16వ వార్డులో బ్రిడ్జి నిర్మించారని, దానికి అప్రోచ్ రోడ్డు ఎప్పుడు నిర్మిస్తారని కౌన్సిలర్ వాహిద్ అధికారులను ప్రశ్నించారు.

➤21వవార్డులోని హెచ్‌బీఎస్ కాలనీలో రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని కౌన్సిలర్ దయాసాగర్ కోరారు.

వాసవీ మాతకు విశేష పూజలు



ఇరుముడిలతో ర్యాలీగా వెళ్తున్న మాలధారులు



పూజలందుకున్న వాసవీమాత

ఆదోని అర్బన్: పట్టణంలోని నగరేశ్వరస్వామి గుడిలో శుక్రవారం ఉదయం వాసవీ మాతకు ఆర్యవైశ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవీ మాలధారులకు ఇరుముడి, పల్లకీ ఉత్సవం, కుంకుమార్చన, వాసవీ హోమం, దీపాలంకరణ సేవ, మహామంగళహారతి కార్యక్రమాలు చేపట్టారు. ఆర్యవైశ్య మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం హానరరీ చైర్మన్ వి.టిప్రకాష్, ప్రెసిడెంట్ కె.టి.జి. శ్రీనివాసులు, సెక్రటరీ కొట్రా వేణుగోపాల్, ట్రెజరర్ జి.శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్ టి.జి. రాంప్రసాద్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు, ఆర్యవైశ్య మహిళా మండలి ప్రెసిడెంట్ వి.త్రివేణి, సెక్రటరీ బి.సంగీత, ట్రెజరర్ హిమబిందు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతిని పరిరక్షించుకుందాం



పూజల్లో పాల్గొన్న భక్తులు

ఆదోని అర్బన్: ప్రపంచంలోని అన్ని సంస్కృతులకు భారతీయ సంస్కృతి మాతృక అని తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. స్థానిక మేదరగేరిలోని మల్లాలమ్మ దేవస్థానంలో నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు శుక్రవారం కుంకుమార్చనతో ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన ధార్మిక సభా కార్యక్రమంలో పలువురు ధార్మిక ప్రముఖులు ప్రసంగించారు. మూడు రోజులపాటు శ్రీమద్రామాయణం మహాభారతం, భగవద్గీతలపై గీత ప్రచారకులు యం.నాగరాజు స్వామి చేసిన ధార్మిక ప్రవచనాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తితిదే ధర్మ ప్రచార మండలి సభ్యులు ఎన్.భీమిరెడ్డి, మల్లాలమ్మ, ఆలయ కమిటీ నిర్వాహకులు తిరుమలేష్, రాజు, రఘు, బాబు పాల్గొన్నారు.

కలశాలతో ఈరన్న సన్నిధికి..



వాహనంలో కలశాలను ఊరేగిస్తున్న భక్తులు

ఆదోని అర్బన్: కౌతాళం మండలం ఉరుకుందలో కొలువైన ఈరన్నస్వామి ఉత్సవాల్లో పాల్గొనేందుకు రాష్ట్రం నుంచే గాక ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. అందులో భాగంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు శుక్రవారం ఆదోని ఆర్ట్స్ కళాశాల నుంచి 27 కలశాలలను వాహనంలో ఉంచుకుని ఊరేగింపుగా బయలుదేరి వెళ్లారు. భాజాభజంత్రీలతో ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ఆర్ట్స్ కళాశాల నుంచి ఎమ్మిగనూరు సర్కిల్, కోట్ల కూడలి, పాత బస్టాండు, కొత్త ఓవర్ బ్రిడ్జి వరకు ఊరేగింపు సాగింది. ఉరుకుంద ఈరన్నస్వామి పుణ్యక్షేత్రం ఈఓ విజయరాజు ఆధ్వర్యంలో భక్తుల సహకారంతో 27 కలశాలను ఏర్పాటు చేశామని భక్తులు తెలిపారు. ఒక్కటి రూ.3,11,016 పడిందని, మొత్తం రూ.84 లక్షలకు పైగానే కలశాలకు ఖర్చు అయ్యిందని, శనివారం నుంచి కలశ ప్రతిష్టాపన, విశేష పూజా కార్యక్రయాలు ఆలయంలో జరుగుతాయన్నారు.

మైనారిటీలకు అండగా వైఎస్సార్ సీపీ



మాజీ ఎమ్మెల్యేను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ మైనారిటీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: మైనారిటీలకు వైఎస్సార్ సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనారిటీ నియోజకవర్గ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన మున్సిపల్ కౌన్సిలర్ ఖాశింబేగ్‌ను నియమించడం పట్ల మైనారిటీ నాయకులు శుక్రవారం మాజీ ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి ఘనంగా సత్కరించారు. పార్టీ మరింత బలోపేతానికి మైనారిటీలు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే ఈసందర్భంగా సూచించారు. కార్యక్రమంలో పార్టీ మైనారిటీ నాయకులు రియాజ్‌అహమ్మద్, షబ్బీర్‌అహమ్మద్, అబ్రార్, రజాక్, మెకానిక్‌బాషా, 18వ వార్డు ఇన్‌చార్జ్ సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి



బుట్టా శివనీలకంఠను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేసేందుకు ఐక్యంగా కృషి చేయాలని బుట్టా ఫౌండేషన్ అధినేత, పార్టీ నాయకుడు బుట్టా శివనీలకంఠ పార్టీ శ్రేణులకు సూచించారు. వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల నియోజవర్గ అధ్యక్షులుగా ఎన్నికైన నేతలు శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయనను కలిసి సత్కరించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుకకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ నియోజకవర్గ పార్టీ యూత్ అధ్యక్షుడు నజీర్ అహమ్మద్, పట్టణ అధ్యక్షుడు నాగేషప్ప, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు ఎంకె శివప్రసాద్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి యుకె రాజశేఖర్, నాయకులు గడ్డం నారాయణ రెడ్డి, ఖాశింబేగ్, విరూపాక్షిరెడ్డి, అల్తాఫ్, మహబుబ్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

సోలార్ వాటర్ హీటర్ల విరాళం



వాటర్ హీటర్లను అందజేస్తున్న ఎస్‌బీఐ ఏజీఎం తేజోమూర్తుల శ్రీనివాస్, ప్రిన్సిపాల్ ఇ.పద్మావతి

ఎమ్మిగనూరు రూరల్: మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలోని జూనియర్ బాలికల వసతి గృహానికి సోలార్ వాటర్ హీటర్లను ఎస్‌బీఐ ఏజీఎం తేజోమూర్తుల శ్రీనివాస్, ఎమ్మిగనూరు మెయిన్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ రవికళాధర్‌శర్మ, డిప్యూటీ బ్రాంచ్ మేనేజర్ ప్రసాద్‌రావు శుక్రవారం ప్రిన్సిపాల్ ఇ.పద్మావతికి అందజేశారు. రూ.1.50 లక్షల విలువైన సోలార్ వాటర్ హీటర్లను అందజేసిన స్టేట్ బ్యాంక్ వారికి ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలిపారు.

తాగునీటిని వృథా చేయొద్దు



వాటర్ వర్క్స్ సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ ఎం.కృష్ణ

ఆదోని టౌన్: తాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని కమిషనర్ ఎం.కృష్ణ సూచించారు. శుక్రవారం పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించారు. ఎల్‌బజీ, ఎంబజీ, మస్టర్ పాయింట్ పంప్‌హౌస్, మహావీర్ కాలనీ, టీజీఎల్ కాలనీ, సీఎస్‌ఐ చర్చి రోడ్డు, శ్రీనివాసభవన్ మెయిన్ రోడ్డు, పాత బస్టాండు, ఆర్టగేరి బసవన్నగౌడ్ ఏరియా, శక్తిగుడి, రైల్వేస్టేషన్ రోడ్డు, పరిసముల్లా ఏరియా, వాహనాల షెడ్‌ను ఆయన తనిఖీ చేశారు. రోడ్లపై చెత్తకుప్పలు, మురుగు కాలువల్లో పూడిక తదితర వాటిని ఏరోజుకారోజు ఎత్తి వేయాలన్నారు. రైల్వేస్టేషన్ రోడ్డులో డివైడర్స్‌ను పరిశీలించారు. రోడ్లపై చెత్తాచెదారం, క్లీనింగ్ పనులను పర్యవేక్షించారు. రోడ్లపై ఎక్కడా చెత్తా చెదారం కనిపించరాదన్నారు. బాధ్యతగా పను లు చేయాలన్నారు. ప్రధాన రోడ్లు,సర్కిళ్లలో చెత్త కుప్ప లు కనిపిస్తే సంబంధిత వర్కర్లు, అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం వహిస్తే సహించబోనన్నారు. సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరె కృష్ణ, జిల్లా అధ్యక్షుడు విజి.వెంకట్రాముడు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న జీఓ నెంబర్ 84,85,117లను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్లు గోట్ల చంద్రశేఖర్, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌ల అమలుపై పునరాలోచించాలి

ఎమ్మిగనూరుటౌన్: కార్మికులకు నష్టం కలిగించే విధంగా ఉన్న నాలుగు లేబర్‌కోడ్‌లపై కేంద్ర ప్రభుత్వం పునరాలోచించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప, సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. అనంతరం ఏఐటీయూసీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

వాడీవేడీగా కౌన్సిల్ సమావేశం

- అభివృద్ధి పనులు, నిధుల కేటాయింపుపై కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం
- ప్రాధాన్యతను బట్టి నిధులు కేటాయిస్తామన్న చైర్‌పర్సన్ శాంత



సమస్యలపై వాదనలు చేసుకుంటున్న మహిళా సభ్యులు

ఆదోని టౌన్: ఆదోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శుక్రవారం వాడీవేడీగా సాగింది. అభివృద్ధి పనులు, నిధుల కేటాయింపు విషయంలో బీజేపీ, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ప్రాధాన్యతను బట్టి పనులకు నిధులు కేటాయిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ శాంత కౌన్సిలర్లకు వివరించారు. ముందుగా అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. అనంతరం సభ్యులు సమస్యలను లేవనెత్తారు. తమ వార్డు అభివృద్ధికి నిధులు కేటాయించడంలేదని బీజేపీ మద్దతు కౌన్సిలర్ లలితమ్మ సభ దృష్టికి తెచ్చారు. వైఎస్సార్ సీపీ సభ్యులు ఇంతియాజ్‌ఆలీ, ఉస్మాన్, అశోక్, ఫయాజ్, వైస్ చైర్మన్‌లు నరసింహులు, గౌస్ మాట్లాడుతూ వార్డుల వారీగా నిధుల కేటాయింపు, అభివృద్ధి పనులు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్, చైర్‌పర్సన్‌ను కోరారు. పట్టణంలో చోరీలు, పిల్లల అదృశ్యం కేసులు ఎక్కువగా జరుగుతున్నాయని కౌన్సిలర్లు బాలాజీ, సందీప్‌రెడ్డి, ఫయాజ్ కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. పనిచేయని సీసీ కెమెరాలను రిపేరీ చేయించాలని కోరారు. ఇంజినీరింగ్ సెక్షన్‌లో కాంట్రాక్ట్ పద్ధతిన తీసుకున్న వ్యక్తికి జీతం ఇస్తున్నా నేటికీ విధుల్లో పాల్గొనలేదని, ఈ విషయమై సమాధానం చెప్పాలని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు పట్టుబట్టారు. సభలో లేని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిపై ఆరోపణలు మానుకోవాలని కోరారు. వైఎస్సార్‌సీపీలో గెలిచి బీజేపీలో చేరిన 35వ వార్డు కౌన్సిలర్ లలితమ్మను రాజీనామా చేసి మళ్లీ గెలవాలని సవాల్ విసిరారు. ఆగిపోయిన మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులను పూర్తి చేయాలని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

- ఆదోని అభివృద్ధికి తాము ఆటంకం కాదని, ఆదోని అభివృద్ధే తమ లక్ష్యమని వైఎస్సార్సీపీ వైస్ చైర్మన్‌లు, కౌన్సిలర్లు తెలిపారు. అబద్ధాలతో పాలన కొనసాగిస్తున్న కూటమి నేతల పనితీరును ప్రజలు గమనిస్తున్నారని, త్వరలోనే అన్నీ తెలుసుకుంటారన్నారు. సమావేశంలో కమిషనర్ ఎం.కృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ తదితరులు పాల్గొన్నారు.